# నమ్మకం

నేను సత్తెనపల్లికి వెళ్ళవలసిన అవసరం ఏర్పడిన మరుక్షణంలోనే నా కళ్ళముందు మెదలిన వ్యక్తులు ఇద్దరు. అందులో మొదటి వ్యక్తి తలచెడిన అరవయ్యేళ్ళ పూటకూళ్ళమ్మ విశాలాక్షమ్మగారయితే, రెండో వ్యక్తి అదే ఇంట్లో భోజన సమయంలో పరిచయమైన నా వయస్సులోనే వున్న తెలుగు మాష్టారు రమాకాంతరావు.

ఇద్దరూ త్వరలోనే ఆప్తులయ్యారు- మొదటామె చక్కని ఇంటి భోజనంతో నన్ను ఆకట్టుకొనగా, రమాకాంతరావు మితభాషిత్వం, నెమ్మదితనం నన్ను అతడికి దగ్గరివాడిని చేసినయి.

నేను ఆ ఊళ్ళో పనిచేసింది సరిగ్గా సంవత్సరంపాటు!

నాకు అప్పటికే పెళ్ళయినా సంసారం పెట్టలేని స్థితి. చేస్తున్న ఉద్యోగం ఉంటుందా ఊడుతుందా అనేది ఒక కారణమయితే, నా భార్య కమల పెళ్ళయిన మూడు నెలలకే తల్లయ్యే సూచనలతో తల్లి పంచన జేరటం మరోటి!

ఉదయం ఎనిమిది గంటలకు విజయవాడలో మాచర్ల బస్సు ఎక్కాను. తిరిగి మూడు సంవత్సరాల తరువాత ఆ ఊరు వెళుతున్నాను అనుకుంటే అటు ఆదుర్దా, ఇటు భయమూ కూడా కలుగుతున్నాయి...

ఎరువులు పంపిణీ చేసే మా కంపెనీకి సత్తెనపల్లిలో ఓ పార్టీనుండి డబ్బు రావాలి. ఆరునెలలబట్టి బాకీ... ఎన్ని సార్లు ఫోను చేసినా అదుగో ఇదుగో అంటున్నాడే కానీ డబ్బు జమచేయటంలేదు. అది తేల్చుకోవటానికే నేను బయల్దేరింది.

రెండు గంటల ప్రయాణం. పదిగంటలకల్లా అక్కడకు వెళితే... ఆ డీలర్‌ను పట్టుకొని, డబ్బు విషయం గట్టిగా మాట్లాడి తేల్చుకోవటం... డబ్బు ఇస్తే బ్యాంకుకు వెళ్ళి కంపెనీ పేరున డి.డి. తీసుకోవటం... అంతా ఓ గంటపని...

ఆపైన విశాలక్షుమ్మగారింటికి వెళ్ళి ఆమెను పలకరించి, భోజనం చేసి రమా కాంతరావు దగ్గరకు వెళ్ళటం...

రమాకాంతరావును చూడాలనే కోరిక మనస్సునంతా ఆవరించి వున్నా- అది సాధ్యమేనా అనే ప్రశ్న నన్ను ఉక్కిరి బిక్కిరి చేయసాగింది.

బస్సు మంగళగిరి ప్రవేశిస్తుండగానే కనబడిన నరసింహస్వామి గుడి గాలిగోపురాన్ని, ఆపైన కొండమీద పానకాలస్వామి గుడిని చూస్తూ మనస్సులోనే ప్రార్థించాను... రమాకాంతరావు బ్రతికే వుండాలి, అతడితో నేను మాట్లాడాలి, అతడిని ఆప్యాయంగా నా గుండెలకు హత్తుకోవాలి అని!

అసలు అతడిని గురించిన ఆలోచన వస్తేనే నా గుండె దడదడలాడుతుంది. మనస్సునంతా కంపింప జేస్తుంది... రమాకాంతరావు ఎలా వున్నాడో?

రమాకాంతరావు బ్రతికే వుంటాడు అనేది నా గాఢ విశ్వాసం...

ఏ పనైనా సానుకూలం అవుతుందీ అనుకుంటేనే అది అవుతుంది- అని మా తాతయ్య జీవించి ఉన్నంతకాలం చెప్పిన హితవచనం... మనిషి సంకల్ప ప్రభావం ఆ పని మీద తప్పకుండా వుంటుంది అనేది ఆయన గాఢ నమ్మకం!

నా ఆలోచనలు రమాకాంతరావు చుట్టూ వలయాల్లా తిరుగుతున్నాయి...

అతడు నాకంటే సంవత్సరం చిన్నవాడు. ఎప్పుడూ ముభావంగా వుండే మాట నిజమే గాని ఆ మధ్య మరీ... పలుకే బంగరమా అన్నంతగా పెదవులు విప్పటం గూడా మానేశాడు...

అప్పటికీ ఒక రోజు అడిగాను: "ఏంటి మాస్టారూ! కొంపదీసి పెళ్ళి చేసుకోబోతున్నారా ఏం... మరేదో ప్రపంచంలో తిరుగుతున్నట్లుగా పరిసరాలనే మర్చిపోయి, మీ ఆలోచనలలోనే మీరు మౌనంగా కూర్చుంటున్నారు!" అన్నాను జోక్ చేస్తున్నట్లుగా, అతడిని నవ్వించాలి అన్న ఆత్రుతతో.

అతడు బిక్కుబిక్కుమంటూ నా ముఖంలోకి చూచాడు. ఎన్ని చతుర సంభాషణలు జరిపినా అతడు నవ్వడనేది, అతడితో పరిచయమైన కొద్ది కాలంలోనే నాకు అవగతమయింది కానీ- మరీ ఇంతగా బిగుసుకు కూర్చుంటాడని ఊహించలేదు!

అతడు ఏదైనా సమస్యతో సతమతమవుతున్నాడేమో!

మాటమారుస్తూ, "మీ స్వగ్రామం ఏది?" అని అడిగాను. పూటకూళ్ళమ్మ ఇంట్లో భోజనం చేస్తున్నాడూ అంటే అతడిది ఈ ఊరు కాదని అర్థమవుతునే వున్నది.

"శిరిపురం!"

"మీతో పరిచయమై మూడు నెలలయినా... లొడలొడా వాగేస్తూ నా గురించి నేను చెప్పుకోవటమేగాని... నోరు తెరిస్తే దాచుకున్న ముత్యాలన్నీ ఎక్కడ జారిపోతయ్యో అన్నట్లుగా మీరు మాత్రం పెదవులు విప్పటమే లేదు!" అన్నాను నవ్వి అంతకు ముందు ఒకరోజు రాత్రిపూట మేం ఇద్దరమే కూర్చొని భోజనం చేస్తున్న సమయంలో.

"మనమేమైనా ఘనకార్యం చేసి వుంటే మన గురించి మనం గొప్పగా చెప్పుకోవాలి... అందరిలాగానే నేను పుట్టాను... అందరి లాగానే పెరిగాను... అందరిలాగానే చదివి, నేను బ్రతకటానికి అనేదానికంటే, మా వాళ్ళు నేను ఉన్నంతకాలమైనా తిండికి ఇబ్బంది పడకుండా వుండేటందుకు నాలుగు రూకల సంపాదనకై ఈ కొలువు చేస్తున్నాను!"

అతడి మాటల్లోని నిరాశ నన్ను వివశుణ్ణి చేసింది.

అతడిలో ఏదో బాధ వున్నది... ఆ బాధతోటే అతడు అతలాకుతలం అవుతున్నాడు అనేది సత్యం... నేను రెట్టిస్తే అది అతడిని మరింతగా క్రుంగదీయవచ్చు.

భోజనం చేసి బయటకు వచ్చాం. తొమ్మిది గంటలయింది. అమావాస్య చీకటిలో రోడ్లమీద గుడ్డిదీపాలు గూడా దేదీప్యమానంగా వెలిగిపోతున్నట్లే వున్నాయి. ఆకాశం చిల్లులు పడిందా అన్నట్లుగా నక్షత్రాలు...

విశాలాక్షమ్మగారి చేతి రుచికరమైన భోజనం చేసిన తరువాత తాంబూల చర్వణం మరింత ఆనందాన్నిస్తుంది.

"మీరు ఇవ్వాళ కిళ్ళీ వేసుకోవాలి... మనం ఇద్దరం కలిసి రాత్రి పూట తీరిగ్గా కూర్చొని భోజనం చేయటమే అరుదు... మధ్యాహ్నం పూట ఆ నిర్ణీత సమయంలో హడావుడిగా నాలుగు మెతుకులు తిని తిరిగి ఉద్యోగానికి పరుగెత్తటంతోటే సరిపోతున్నది!"

"వద్దండీ... నాకు అలవాటు లేదు!"

"అలవాటయ్యేందుకేమున్నది... ఇదేమైనా బ్రహ్మవిద్యా!"

"అనిగాదు నా ఉద్దేశ్యం... అలవాటు లేనిదానికి మీచేత రెండు రూపాయలు ఖర్చుపెట్టించడం అవసరమా అని!"

నాకు పట్టుదల పెరిగింది.

"ఉఁహూఁ... ఈరోజు మీరు కిళ్ళీ వేసుకోవాల్సిందే... సిగరెట్టు అంటారా... నేను ఒత్తిడి చేయను... అదో దురలవాటు... మీకెందుకు అంటగట్టాలి!"

అతడు ఎంత వద్దన్నా వినకుండా రెండు కిళ్ళీలూ కట్టించి అతడికొకటి ఇచ్చాను.

"వెళ్దాం పదండి... ఇక్కడకు మా గది దగ్గరే... కూర్చొని కబుర్లు చెప్పుకుందాం!" సిగరెట్టు ముట్టిస్తూ అన్నాను.

అతడు ఏ కళనున్నాడో... నేను ఆ మాట అనగానే నా వెంట వచ్చాడు.

"మీ నాన్నగారేం చేస్తుంటారు?"

"వ్యవసాయమే... మాకున్న కొద్ది పొలమే గాకుండా, తెలిసినవాళ్ళవి మరో రెండెకరాలు తీసుకుని కౌలుకు చేస్తుండే వారు... నాలుగేళ్ళయింది పోయి!" అన్నాడు దిగులుగా ముఖం పెట్టి.

మనిషికీ మనిషికీ నడుమ అప్యాయత- కొన్ని విషయాలల్లో సామ్యం వుంటేనే పెరుగుతుందేమో...

నాకూ నా చిన్నతనంలోనే నాన్న పోయాడు... జీవితానికి దారి చూపవలసిన ముఖ్యమయిన వ్యక్తి లేకపోవటం ఎంత బాధాకరమైన విషయమో నాకు స్వానుభవమే...

అనునయిస్తున్నట్లుగా అతడి చేతిమీద చేయి వేశాను.

"అన్నలూ, తమ్ముళ్ళు... అక్కలూ, చెల్లెళ్ళూ?"

"నాకు ఇద్దరు తమ్ముళ్ళున్నారు... ఒక చెల్లెలు ఉన్నది!"

"చదువుకుంటున్నారా వాళ్ళు?"

"చదువుకుంటున్నారు... ఆపైన వ్యవసాయంలోనూ సహాయంగా వుంటారు... నేనేదో గొప్పవాడిని అవ్వాలని, ఉద్యోగం చేయాలని మానాన్న ఎంతగానో అభిలషించాడుగాని... నేను చేస్తున్న ఈ చిన్న ఉద్యోగమైనా చూడకుండానే ఆయన కన్ను మూశాడు!"

అతడి మాటతీరు నాకు జాలివేసింది. విషాదకర జీవితమంటేనే చాలా బరువైనది!

నా గదిలో ఇద్దరం చాప పరుచుకు కూర్చున్నాం.

"నా సంపాదన ఇంటిల్లిపాదినీ పోషిస్తున్నదీ అని చెప్పలేనుగాని... ఇంట్లో ప్రతి పుటా తిండికి వెతుక్కోవాల్సిన అవసరం లేకుండా గడిచిపోతున్నది!" అన్నాడు పేలవంగా

నవ్వుతూనే, ఓ నిట్టూర్పు విడిచి, “అయినా అదీ ఇంకెన్ని రోజులు ఇలా నడుస్తుందో తెలియకుండా వున్నది!” అన్నాడు ముఖమంతా నల్లబడగా దిగులుగా.

“అదేం... స్కూలు టీచరు ఉద్యోగానికేమిటండీ... ఈ స్కూలు కాకపోతే మరో స్కూలు... దీనికి తోడు మరో నలుగురు పిల్లలకు ఇంటిదగ్గర ట్యూషన్ చెప్పుకుంటే కావాల్సినంత డబ్బు... అసలు మన చేతితో విద్యను పది మందికి పంచిపెట్టటమే ఓ ఉన్నతమైన ఆశయం...!”

“అది గాదు నా బాధ!” అతడు మరింత కృంగిపోతున్నాడా అనిపించింది ఆ మాట అంటున్నప్పుడు.

నేను అనునయంగా అతడి భుజం మీద చేయి వేసి, “ప్రతి మనిషికీ కొన్ని ఈతిబాధలు ఉంటయ్... చిన్నదో పెద్దదో నాలుగు రాళ్ళు దొరికే ఉద్యోగమున్నది... కాస్తో కూస్తో పొలం ఉన్నది... బహుశః మీ ఊళ్ళో మీ కుటుంబం ఏ దిగులూ లేకుండా ఉండేటందుకు చిన్నదైనా స్వంత గూడు అంటూ ఉండివుండవచ్చు... ఇక హాయిగా నచ్చిన ఓ అమ్మాయిని సహధర్మచారిణిగా తెచ్చుకున్నారంటే ఆ ఆనందమే వేరు... కానీ నాలాగా మాత్రం పొరబాటు పని చేయవద్దు... జీవితాన్ని మీ ఇద్దరే ఆనందంగా అనుభవించేలా మీ నడుమకు మరో మనిషిని రెండు సంవత్సరాల దాకా ఆహ్వానించవద్దు... నా తొందరపాటు వలన మా వివాహమయి సంవత్సరం దాటకపోయినా మా ఆవిడ మరో ఆరునెలల్లో పిల్లనో, పిల్లవాడినో ఎత్తుకు వస్తానంటూ పుట్టింటికి జేరిపోయింది!” అన్నాను పకపకా నవ్వుతూ.

“నాకు ఆ దిగులు లేదులేండి... అసలు నేను వివాహం చేసుకునే అవసరమే రాకపోవచ్చు!”

“అదేం?” అధాట్టుగా తలెత్తి అతడి ముఖంలోకి చూచాను.

అతడు శూన్యంలోకి చూస్తున్నట్లుగా నలువైపులా పిచ్చిచూపులు చూడసాగాడు. అతడి ముఖం తెల్లగా పాలిపోతున్నది. అసలే చిన్నవైన కళ్ళు మరింత చిన్నవై నీటితో నిండిపోతున్నాయి... అతడు ఎంత బిగపట్టుకున్నా దుఃఖాన్ని ఆపుకోలేకపోతున్నట్లుగా రెండు చేతుల్నీ ముఖానికి అడ్డుపెట్టుకొని ముందుకు వాలిపోతున్నాడు... అతడు కోలుకోలేని అనారోగ్యంతో బాధ పడటంలేదుగదా!

నేను వడివడిగా అతడి రెండు భుజాలూ పట్టుకొని, “ఏమైంది... ఏమైంది?” అన్నాను ఖంగారుగా.

అతడు ఒక్కసారిగా ఏడ్వటం మొదలుపెట్టాడు నన్ను మరింతగా విచలితుణ్ణి చేస్తూ.

తరువాత రెండు నిముషాలల్లోనే- తనని తాను నిగ్రహించుకుంటున్నట్లుగా చటుక్కున తలెత్తాడు. కొయ్యలా బిగుసుకుపోతున్నట్లుగా నితారుగా కూర్చున్నాడు.

"మా కుటుంబానికి దేవుడిచ్చిన శాపం ఒకటి వున్నది... గత మూడు నాలుగు తరాలుగా మేం అనుభవిస్తూనే వున్నాం... మా యింటి పెద్దకొడుక్కు తన ఇరవయ్యో ఏటే నూరేళ్ళు నిండుతున్నాయి... నేను వచ్చేవారం ఈ రోజున ఇరవయ్యో ఏట కాలు పెట్టబోతున్నాను!" అతడు బావురుమంటూ నా వళ్ళో వాలిపోయాడు. "నా బ్రతుకు రోజుల్లోకి వచ్చింది మాస్టారూ!"

అతడి మాటలు వింటూనే గుండె ఆగిపోతున్నదా అన్నంతగా బిగుసుకుపోయాను. నాకు నోరు పెగలటమేలేదు. ఇదెక్కడి నిజం?

కానీ, నేనూ డీలాపడిపోతే అతడు మరింతగా కృంగిపోతాడు. మరింతగా విలపిస్తాడు. మరింతగా ఆ భయంతో, దిగులుతో గుండెను బ్రద్దలు చేసుకుంటాడు- అనే నిజం నన్ను వెన్నుతట్టింది.

క్షణంలో నన్ను నేను నిగ్రహించుకుంటూ అతడిని నా ఒళ్ళోనుంచి పైకి ఎత్తాను.

"ఎవరు చెప్పారు ఆ అర్థంలేని మాటలు మీకు?" అన్నాను విసురుగా, చిరాగ్గా- అదంతా ట్రాష్ అన్నట్లుగా.

"చరిత్ర చెబుతోంది!"

"చరిత్ర లక్ష చెబుతుంది... నమ్మేయటమేనా?... అవన్నీ ఎందుకూ పనికిరాని మూఢనమ్మకాలు... ఒకళ్ళు చచ్చివుంటే మిగతావాళ్ళు ఆ భయంతోటే చచ్చివుంటారు... అసలు వాళ్ళు ఏ కారణంతో చచ్చిపోయారో మీకు తెలుసా... తెలియదు... ఏ రోగమొచ్చి చచ్చారో తెలుసా... మీకు తెలియదు... మీకు వాళ్ళు చావటమొక్కటే తెలుసు... అదీ మిడిమిడి జ్ఞానంతో మీ పెద్దవాళ్ళు కథలల్లి చెప్పబట్టి... ఆ రోజుల్లో మనుష్యులు రోగాలొచ్చినప్పుడు వైద్యుల్ని, మందుల్ని కాదు నమ్ముకున్నది... గుళ్ళనూ, మంత్రగాళ్ళను, మంత్రాలను...!"

అతడికి నా మాటలు చెవికెక్కటం లేదేమో అనిపించేలా ఇంకా ఏడుస్తూనే వున్నాడు.

"రమాకాంతరావ్! నువ్వు చదువుకున్నవాడివి... నలుగురుకి చదువు చెబుతున్న వాడివి... నువ్వూ ఇలాంటి వాటిని నమ్ముతున్నావంటే నాకు చాలా బాధగా వున్నది... ఒక్కటి చెప్పు! మీ కుటుంబంలో అలా చచ్చిన వాళ్ళంతా ఏమైనా చదువుకున్నారా?"

అతడు తల అడ్డంగా తిప్పాడు... చదువుకొని వుండరు అన్నట్లుగా.

నాకు అతడి సమాధానం మరింత బలాన్నిచ్చింది. "ఏ తరంలోనూ మీ ఇంట్లో చదువుకున్న వాళ్ళు లేరు... మరి అలా జరగకుండా నీకు చదువు ఎలా అబ్బింది... అంటే నువ్వు చరిత్రను తిరగరాశావన్నమాటే గదా... ఇంకా నీకు ఆ చావు భయం మాత్రం దేనికి?"

అతడు నా మాటలకు బొమ్మలా బిగుసుకుపోయి, కళ్ళప్పగించి నా వంకే చూస్తున్నాడు.

నాకు మరింత ఊపు వచ్చింది. "అంటే వాళ్ళు వాళ్ళ పిచ్చి నమ్మకాలతో ధైర్యం కోల్పోయి చచ్చారు... నిన్ను నీ చదువు బ్రతికిస్తుంది... లే... లేచి అదుగో అక్కడ బక్కెట్‌లో నీళ్లున్నాయి... ముఖం కడుక్కురా... బయటకు వెళ్ళి కాస్త టీ త్రాగి వద్దాం!"

"వద్దండీ!"

అతడిలోని మృత్యుభయం నా నాలుగు మాటలతోనే పోదని నాకు తెలుసు. అందుకే చిన్నగా నవ్వాను.

"ఉఁహూఁ... పద వెళ్దాం... నేను చెబుతున్నాను గదా... నువ్వు నూరేళ్ళూ బ్రతుకుతావ్... అనవసరంగా వెధవ ఆలోచనలతో బుర్ర పాడుచేసుకోబోకు!"

నా మాటలు అతడికి అంత త్వరగా ధైర్యాన్ని, నమ్మకాన్ని ఇవ్వవని తెలిసినా అతడు లేచి బయటకు వెళ్ళటానికి ఉద్యుక్తుడవ్వటం నాకు తృప్తి నిచ్చింది.

రాత్రి పది గంటలప్పుడు అతడిని అతడి గది దగ్గర దించి నా గదికి వచ్చినా నా చెవుల్లో అతడి మాటలూ, అతడి రోదనాస్వరమే ప్రతిధ్వనిస్తున్నాయి. 'బ్రతకను' అనే అతడి వేదనే నన్ను అతలాకుతలం చేస్తున్నది.

ఆ రాత్రి అతడి జాలి చూపులు నన్ను నిద్రపోనీయలేదు.

మరునాడూ అదే తీరు... అదే దిగులు ముఖం... అవే తడుస్తున్న కళ్ళు... అతడి నెత్తి మీద యముడు కూర్చొని అతడి మెడకు పాశాన్ని బిగించి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడా అనిపిస్తోంది నాకు అతడిని చూస్తుంటే...

రెండు రోజులు చూశాను... మూడు రోజులు చూశాను... నేను ఎన్ని ధైర్య వచనాలు పలికినా అతడిలో నేను ఆశించిన మార్పు రావటం లేదనేది నాకు అర్థమవుతున్నది...

నిజమే! చావు భయం అనుభవించేవాడికే తెలుస్తుంది... మనం ఎంత చెప్పినా అవి పైపై మాటల్లాగానే వుండి అతడిలోని భయం వాటిని మ్రింగివేస్తుంటుంది!

"ఒక పని చేద్దాం... ఇక నిన్ను ఖాళీగా వుండనీయను నేను... స్కూలు వున్నంత సేపూ స్కూలు... లేకపోతే నాతోనే వుండాలి... మనం బయట ఎక్కడైనా కబుర్లు చెప్పుకుంటూ హాయిగా తిరుగుదాం... సినిమాలకు వెళ్దాం... దేవాలయాలకు వెళ్ళి ఆధ్యాత్మిక చింతనలో మిగతా బాధలను మరిచిపోదాం... ముందు నువ్వు ఇప్పుడున్న ఆ తడికల గదిని వదిలేసి నా దగ్గరకు వచ్చేసేయ్!... పనిలేని బుర్రే దారిన పోయే పిశాచాలనన్నిటినీ పిలిచి నెత్తికెక్కించుకుంటుంది!"

అతడు నాకు బంధువు కాదు. చిన్న నాటి స్నేహితుడూ కాదు. ఎన్నో సంవత్సరాల అనుబంధమూ మా నడుమ లేదు... నిన్నగాక మొన్న పూటకూళ్ళమ్మ ఇంట్లో భోజన సమయంలో పరిచయమైన తోటి మానవుడు... కానీ, నాకు వున్నది ఒక్కటే- జాలి! తోటి మనిషి మీద జాలి! బ్రతుకు భయంతో గిలగిలలాడుతున్న మనషిమీద జాలి! అతడి ఓ మూఢ నమ్మకానికి బలి అవ్వకుండా బ్రతికించాలనే తపన...

"వద్దండీ!" అన్నాడు. ఎన్ని సార్లు చెప్పినా నా గదికి వచ్చి నాతోపాటు ఉండటానికి అంగీకరించలేదు.

నేను మాత్రం అతడిని వదిలిపెట్టలేదు. అతడిని అనునయిస్తూనే వున్నాను. నాకు దొరికిన ఖాళీ సమయాన్నంతా అతడితోటే గడుపుతున్నాను. అతడి మనస్సును అతడిలోని బాధనుండి, భయంనుండీ నా శాయశక్తులా దూరం చేయటానికే ప్రయత్నిస్తున్నాను.

రెండు మూడు సార్లు అతడితో అతడింటికి శిరిపురంగూడా వెళ్ళి వచ్చాను- ఆ మాటలూ ఈ మాటలూ చెబుతూ... వాళ్ళ అమ్మ పరిస్థితీ అదే!

వాళ్ళను ఆ ఆలోచనలనుండి దారి మళ్ళించటం నా తరం కాదనిపించి నిరాశ కలుగుతుంది ఒక్కోసారి. అయినా నాకు భగవంతుడి మీద నమ్మకమున్నది... ఆయన అమాయకులకు అన్యాయం చేయడు అనేది నా విశ్వాసం... అందుకే నా ప్రయత్నాలను నేను విరమించుకోదలుచుకోలేదు.

కానీ కాలం మన చేతిలో లేదు గదా... అలాగే పరిస్థితులూ మన చేతిలో ఉండవు...

నాకు విజయవాడలో మరో మంచి ఉద్యోగం రావటం... అందునా అది నా స్వగ్రామానికి దగ్గర అవ్వటం... నేను సత్తెనపల్లిని వదిలి వేయక తప్పలేదు.

అతడు నేను ఆ ఊరును వదిలి వెళ్ళిపోతున్నానని తెలిసిన రోజున భోరున ఏడ్చాడు, 'నాకు ఇక దిక్కెవరు?' అన్నట్లుగా. "ఇక నా బాధను నేను ఎవరికి చెప్పుకోవాలి?"

అతడు బ్రతికి తీరాలనేది నా మనోవాంఛ అయినా- నా భవిష్యత్తూ నాకు ముఖ్యమే కదా! తప్పదు... అతడిని వదిలి వెళ్ళక తప్పదు...

మరునాడు వెళతాననగా ఆరాత్రి అతడిని నా గదిలోనే కూర్చోబెట్టుకొని చేయాల్సిన హితబోధలన్నీ చేశాను. అంతకు క్రితం రోజే వెళ్ళి వాళ్ళమ్మకూ ధైర్యం చెప్పి వచ్చాను.

ఆ రాత్రి మా ఇద్దరికీ నిద్రలేదు. మరునాడు ఉదయం తెల్లవారుతుండగానే నా కొద్ది సామాన్లనూ తీసుకొని నేను బస్సెక్కి సత్తెనపల్లి వదిలేశాను.

బస్టాండులో రమాకాంతరావు శోకిస్తున్న కళ్ళను చూడలేనట్లుగా బస్సు బయల్దేరేటంత వరకూ తలవంచుకునే కూర్చున్నాను.

ఆ తరువాత ఒకటి రెండు ఉత్తరాలు- నానుండి ధైర్య వచనాలతోనూ- అతడినుండి జాలిగొలిపే, నిరాశాపూరిత వాక్యాలతోనూ- అటూ ఇటూ తిరిగినయి.

కొత్త ఉద్యోగంలో కుదురుకోవటానికి పడే శ్రమలో నా బ్రతుకు నాదయింది. కొత్త మనుష్యులు... కొత్త పరిచయాలు... కుటుంబ సమస్యలు... పుట్టింటికి పురుడు పోసుకోవటానికి వెళ్ళిన నా భార్య అనారోగ్యం... నన్ను రమాకాంతరావు మీద ఆలోచనలకు కాస్తంత దూరం చేసింది... తరువాత తరువాత ఈ రెండు మూడు సంవత్సరాలలో అప్పుడప్పుడూ గుర్తుకు వస్తున్నా అది కొద్ది క్షణాలే అయి కూర్చోవటం మొదలు పెట్టింది.... రమాకాంతరావు... అతడి బాధా కాలంతోపాటు నాకు దూరమయినయి...

ఇదుగో... మళ్ళీ ఇప్పుడు... ఉద్యోగరీత్యా సత్తెనపల్లి వెళ్ళవలసిన అవసరం రావడంతో గతంలో అక్కడ నేను గడిపిన ప్రతి క్షణం కళ్ళముందు మెదిలింది... నా గుండె బరువెక్కేలా!

సత్తెనపల్లిలో బస్సు దిగేటప్పటికి పదిగంటలయింది. ఎండ మండిపోతోంది.

రమాకాంతరావు గనుక ఆ గండంనుంచి బయటపడి గట్టెక్కి వున్నట్లయితే- అతడిని పట్టుకోవటానికి నాకు రెండే రెండు మార్గాలు కనిపిస్తున్నాయి.

ముందు విశాలాక్షుమ్మగారి దగ్గరకు వెళ్ళటం ఉత్తమం. ఇంకా భోజనానికి రోజూ అతడు వస్తున్నాడూ అంటే సమస్య తీరిపోయినట్లే... మధ్యాహ్నం అతడిని కలవటం బహు తేలిక...

చేతిలో బ్రీఫ్‌కేస్‌తో ఆమె ఇంటి వైపుకు వడివడిగా అడుగులు వేశాను.

తిరిగి నా మనస్సు మూడు సంవత్సరాల క్రితం నేను ఈ ఊరును వదిలి వెళ్ళకముందు పడ్డ వేదనలోకి జారిపోతోంది... ఎంత నిగ్రహించుకుంటున్నా...

విశాలక్షుమ్మగారి పెంకుటింటిముందు ఆగాను. తలుపు తీసే వున్నది. ముందు గదిలో అప్పటికే కొందరు భోజనాలు చేస్తున్నారు.

వాళ్ళకు వడ్డిస్తున్న ఆమె ఒక్కక్షణం తలెత్తి చూచి- ఎవరా అన్నట్లుగా కళ్ళు చికిలించింది. తరువాత నన్ను గుర్తించినట్లుగా పెద్దగా నవ్వి, "మీరా సత్యం బాబూ... ఎన్నాళ్ళకెన్నాళ్ళకు... రండిరండి!" అన్నది ముఖమంతా విశాలం చేసుకొని.

"బాగున్నారా?" అన్నాను ముందుకు అడుగు వేస్తూ.

"బాగానే వున్నాను!" అన్నది నవ్వి. "కాళ్ళు కడుక్కోండి... వడ్డిస్తాను!" అన్నది ఆత్మీయంగా.

"పన్నెండు గంటలకు వస్తాను గాని... రమాకాంతరావు మధ్యాహ్నం భోజనానికి వస్తున్నాడా?" అన్నాను ఆశగా...'వస్తున్నాడు' అనేమాట ఆమె నోటినుండి వినాలనేది నా అంతరంగపు కోరిక.

"రమాకాంతరావా?.... ఎవరూ?" కాస్త నుదురు చిట్లించి అన్నది.

– అతడి పేరే మర్చిపోయిందంటే అతడు రావటం మానేయలేదుగదా... కలవరపాటు నన్ను కుదిపింది.

"నాతోపాటు తిరుగుతుండేవాడు... సామాన్యంగా ఇద్దరం కలిసి ఒకే సమయంలో భోజనానికి వస్తుండేవాళ్ళం... మాట్లాడకుండా ఎప్పుడూ మౌనస్వామిలా కూర్చుంటుండేవాడు!" ఏవో నోటికొచ్చిన గుర్తులు హడావుడిగా చెప్పసాగాను.

"ఓ... ఆ తెలుగు మాస్టారా!... లేదండీ! మీరు ఈ ఊరునుంచి వెళ్ళిపోయిన తరువాత మహా వస్తే ఓ పది పదిహేను రోజులు వచ్చాడేమో... తరువాత కనబడనే లేదు... ఎక్కడ తింటున్నాడో ఏమో... లేకపోతే మీలాగానే ఇక్కడ ఉద్యోగం మానేసి మరో చోటుకు వెళ్ళాడేమో!" అన్నది ఎదురుగ్గా పీటల మీద కూర్చున్న వాళ్ళకు ఆధరువులు మారు వడ్డిస్తూ.

నా గుండె గుభేలుమన్నది.

నేను చటుక్కున వెనక్కు తిరిగాను, "మళ్ళా వస్తాను!" అంటూ.

వడివడిగా రోడ్డెక్కాను... ఎదురుగ్గా కనబడిన ఖాళీ రిక్షాను పిలిచి ఎక్కి కూర్చుంటూ- ఆ రోజుల్లో అతడు పని చేసిన స్కూలు గుర్తులు చెప్పి అక్కడకు పోనివ్వమన్నాను ఆత్రంగా.

ఒకదారి మూసుకుపోయింది. ఆమె అన్నట్లుగా అతడు ఆ ఉద్యోగం మానివేసి, ఈ ఊరు వదిలి వెళ్ళిపోయి వున్నట్లయితే రెండోదారి గూడా మూసుకుపోయినట్లే... ఇక ఆఖరుగా మిగిలింది- గుంటూరు వెళ్ళే రైలెక్కి శిరిపురం స్టేషన్లో దిగటం!

టాపులేని రిక్షాలో ఆ గతుకుల రోడ్లమీద పోవటం చాలా ఇబ్బందిగానే వున్నది. పైనుంచి ఎండ చెమటలు కారుస్తుంటే ఎత్తుపల్లాల రోడ్డు శరీరాన్నంతా కుదిపేస్తోంది.

దూరంగా స్కూలు... అదే స్కూలు... అదే ఆకారం... సగం వెలిసిన అక్షరాలతో కనబడీ కనబడకుండా వున్న అదే బోర్డు...

రిక్షా మీదనుంచి దూకుతున్నట్లుగా దిగి లోపలకు వడివడిగా అడుగులు వేశాను.

రమాకాంతరావు వుండి తీరాలి... అతడు బ్రతికే వుండాలి!... నా శరీరం ఆవేశంతో ఊగిపోతున్నది.

క్లాసులు జరుగుతుండటంతో పిల్లల గోల అంతగా లేదు... టీచర్ల మాటలే పెద్దగా వినబడుతున్నాయి... ఆ శబ్దాలలో మౌనస్వామి కంఠం గుర్తించడం బహు కష్టం.

మెట్లెక్కుతూ పక్కగా వున్న 'హెడ్‌మాస్టర్' అని బోర్డుపెట్టివున్న గదివైపుకు నడిచాను. రమాకాంతరావును గురించి చెప్పగలిగితే ఆయనే చెప్పాలి!

అడుగులు వేయసాగాను ఆ గది వైపుకు ఆత్రంగా.

తెరిచివున్న తలుపులగుండా లోపలకు చూచాను.

హెడ్మాస్టరుగారి కుర్చీలో ఓ వ్యక్తి... ఆయనకెదురుగా మరో ఇద్దరు... పెద్దగా మాట్లాడుకుంటూ నవ్వుకుంటున్నారు...

"నాకు రమాకాంతరావు...." తెరుచుకున్న నోరు తెరుచుకున్నట్లే వుండిపోయింది...

నన్ను చూచి నా వైపుకు తిరిగిన ఆ ముగ్గురిలో హెడ్మాస్టరు కుర్చీలో కూర్చొని వున్న వ్యక్తి రమాకాంతరావే! కాస్త లావెక్కి వుండటంతో చూచిన క్షణంలోనే గుర్తించలేకపోయాను...

అతడిని పట్టుకొని కౌగిలించుకోవాలన్న ఆవేశంతో లోపలకు వెళ్ళాను...

మైగాడ్! దేవుడు నా మాట విన్నాడు...

రమాకాంతరావు నన్ను చూస్తూనే దిండ్లు వేసివున్న ఆ కుర్చీలోనుంచి లేచి, "సత్యనారాయణరావు గారూ!" అన్నాడు ఆనందంగా.

ఎదురుగ్గా కూర్చున్న ఇద్దరూ తమ హెడ్మాస్టర్‌కు పరిచయమైన, తామెప్పుడూ చూడని, నన్ను ఎవరా అన్నట్లుగా విచిత్రంగా చూస్తున్నారు.

"ఎప్పుడు రాక!" ఆనందంగా అడిగాడు రమాకాంతరావు. "కూర్చోండి!" అన్నాడు అటెండరు కోసం బెల్లునొక్కుతూ.

"ఇదే రావటం!" అన్నాను కూర్చుంటూ.

ఆవేశంతో కూడిన ఆనందంతో తృప్తిగా అతడి వంకే చూస్తున్నాను.

"ఎలా వున్నారు?" సంతోషంతో కళ్ళు తడుస్తుండగా అడిగాను.

"ఇలా...!" అతడు పకపకా నవ్వాడు. "సంవత్సరం క్రితం ప్రొమోషన్‌గూడా ఇచ్చి నన్ను ఈ కుర్చీలో కూర్చోబెట్టారు!"

అతడు అంత పెద్దగా నవ్వటం ఇప్పుడే నేను చూస్తున్నది.

అటెండరు వస్తే, "ముందు మంచినీళ్ళు తీసుకురా... ఆ తరువాత నాలుగు కప్పుల కాఫీ పట్టుకురా... నేనీపూట క్లాసు తీసుకోవటం లేదని క్లాసుకు వెళ్ళి చెప్పిరా... పది నిముషాలల్లో ఓ రిక్షా పిలుచుకు రా... నేను ఇంటికి వెళ్ళి వస్తాను!" పాఠం అప్పచెబుతున్నట్లుగా గడగడా చెప్పేశాడు.

నేను నోరు తెరుచుకొని అతడినే చూస్తూ వుండిపోయాను.

"మా అమ్మ మిమ్మల్ని తల్చుకోని క్షణం లేదు... ఇప్పుడు మిమ్మల్ని చూస్తే ఆమెకు పండుగే! మా కాపురమంతా ఇప్పుడు ఇక్కడే!" అతడు ముఖమంతా విశాలం చేసుకొని నవ్వుతూ అన్నాడు.

ఆమాట నాకు చాలా ఆనందాన్ని కలిగించింది.

"నేను పెళ్ళి చేసుకున్నాను గాని మీరు చేసిన పొరబాటే నేనూ చేశాను... ఆవిడగారు కాపురానికి వచ్చిన నెల రోజులలోనే లేడీ డాక్టర్‌ను చూడాల్సిన అవసరం ఏర్పరిచింది!" అన్నాడు మరోసారి పెద్దగా నవ్వుతూ. "నా ఉత్తరాలకు సమాధానమివ్వకపోతే పోయారు... కనీసం నా పెళ్ళి శుభలేఖ చూసయినా వస్తారేమోనని ఆశపడ్డాను... మా అమ్మ అయితే మరీ! మీరు రానందుకు ఎంతో నిరుత్సాహపడింది!"

"నేను ఎక్కువ రోజులు మీకు ఇచ్చిన అడ్రసులో లేను.... మూడు నాలుగు ఇళ్ళు మారి, చివరకు మా కంపెనీకి దగ్గరగా వుంటుందని గొల్లపూడిలో నివాసమేర్పరుచుకున్నాను... వెళ్ళిన కొత్తల్లో మన మధ్య నడిచిన ఉత్తరాలే... ఆ తరువాత మీనుండి నాకెలాంటి సమాచారమూ అందలేదు... నేను గనుక శుభలేఖ చూచి వున్నట్లయితే తప్పకుండా వచ్చి వుండేవాడిని... తరువాత తరువాత మరో జీవితం... పనుల ఒత్తిడి..." నసుగుతున్నట్లుగా అన్నాను.

బయటకు వచ్చి రిక్షాలు ఎక్కుతుండగా రమాకాంతరావు తల్లి నా కళ్ళముందు మెదిలింది... ఆమె ఆనందంగా, కృతజ్ఞతగా నా వంకే చూస్తున్నట్లున్నది...

నేను ఆమె చేత, ఆమెకు ఎంతగా ఇష్టం లేకపోయినా, దేఁవుడు లాంటి చనిపోయిన ఆమె భర్త మీద ఓ హేయమైన అభాండం వేయించటం నేను చేసిన ఘోరమైన నేరమే అవ్వవచ్చుగాని... అదే ఆయన జన్మనిచ్చిన అతడి కొడుకుకు కొత్త జీవితం ప్రసాదించిందనే నిజం నేను చేసింది తప్పులా అనిపించకపోఁగా నా మనస్సుకెంతో తృప్తిని కలిగిస్తోంది.

తమ వివాహమయ్యేనాటికే ఆయనకు మరో స్త్రీతో సాంగత్యమేర్పడిందనీ... ఆవిడకో కొడుకనీ... తన భర్తకు పెద్ద కొడుకయిన అతడు ఇరవయ్యో ఏట మరణించినట్లుగా తనకు ఇప్పుడే తెలిసిందని- రమాకాంతరావుకు ఆతడి తల్లి చేత మరీ చెప్పించాను!

నా ప్రయోగం సఫలమయింది!

(*స్వాతి: మాసపత్రిక: అక్టోబర్, 2006*)